## క్లుప్తంగా

### దత్తాత్రేయుడికి విశేష పూజలు



దత్తాత్రేయ స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న దత్తాత్రేయ స్వామివారికి విశేష పూజలను నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించారు. తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు.

### కామేశ్వరీదేవికి గాజుల మాలలు సిద్ధం



గాజులతో మాలలు చేస్తున్న మహిళలు

మహానంది: శ్రావణమాసం, రెండో శుక్రవారం సందర్భంగా మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి అమ్మవారికి గాజులతో అలంకరణ చేయనున్నారు. స్థానిక మహిళలు గురువారం పదివేలకు పైగా గాజులతో అమ్మవారి కోసం మాలలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. భక్తిగీతాలను ఆలపిస్తూ భక్తిశ్రద్ధలతో మాలలు తయారు చేస్తున్నారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో తొలిసారి శ్రావణమాసం సందర్భంగా ప్రతి శుక్రవారం అమ్మవారికి వివిధ రకాల అలంకరణ పూజలు చేయనున్నట్లు వేదపండితులు బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర అవధాని తెలిపారు.

### పైపు లైన్ ఏర్పాటు



పైపులు ఏర్పాటు చేయిస్తున్న సర్పంచు వరప్రసాదరావు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామం బీసీ కాలనీలో గురువారం అంతర్గత వీధిలో పైపు లైన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచు వరప్రసాదరావు మాట్లాడుతూ ఈ కాలనీలో పాత లైన్ దెబ్బతినడంతో కాలనీలో నీటి సమస్య ఉత్పన్నమైందన్నారు. దీంతో సమస్య పరిష్కారం కోసం పాత పైపులు తొలగించి కొత్త పైపు ఏర్పాటు చేశామన్నారు. ఇక నుంచి బీసీ కాలనీలోని అంతరగత వీధుల్లో వీధి కుళాయిలకు నీరు సాఫీగా సరఫరా అవుతుందన్నారు.

### 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



పనులు చేస్తున్న సిబ్బంది

మహానంది: తిమ్మాపురం సబ్‌స్టేషన్‌లో మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అలిపిరి నుంచి తెచ్చిన 8 మెగా వోల్ట్స్ ఆంప్స్(ఎంవీఏ) ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు డీఈ చారీలు, ఏఈఈ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సబ్‌స్టేషన్ వద్ద జేసీబీ, క్రేన్ సాయంతో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. దీని ద్వారా పుట్టుపల్లె, అబ్బీపురం,తిమ్మాపురం ఫీడర్లకు ఒకేసారి సరఫరా ఇచ్చినా ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. గతంలో ఐదు మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది,ప్రస్తుతం మూడు మెగావాట్ల సామర్థ్యం ఎక్కువగా ఉన్న పీటీఆర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

### యూరియా పంపిణీ

ఆత్మకూరు: మండలంలోని నల్లకాల్వ గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో గురువారం రైతులకు యూరియాను ఏఓ హేమలత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరైతుకు రెండు బస్తాల చొప్పున అందిస్తున్నట్లు చెప్పారు. 133 మంది రైతులకు యూరియా అందజేశామన్నారు. యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ సతీష్ ఉన్నారు.

### ల్యాబ్ టెక్నీషియన్‌పై చర్యలు తీసుకోవాలి



డీడీఓకు ఫిర్యాదు చేస్తున్న ఆశా వర్కర్లు

వెలుగోడు: బోయరేవుల ఆశా వర్కర్ మేరీ పట్ల అమర్యాదగా ప్రవర్తించిన వెలుగోడు సీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ అగస్టిన్ రత్నరాజుపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగమోహన్, మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ డిమాండ్ చేశారు. గురువారం ఆశావర్కర్లతో కలిసి వారు డీడీఓ సులోచనకు ల్యాబ్ టెక్నీషియన్‌పై ఫిర్యాదు చేశారు. ఆశా వర్కర్‌కు ల్యాబ్ టెక్నీషియన్‌తో డీడీఓ క్షమాపణలు చెప్పించడంతో సమస్య సద్దుమణిగింది.

# గర్భంలోనే సమాధి?

- కానులకు కక్కుర్తిపడి లింగనిర్ధారణ చేస్తున్న స్కానింగ్ సెంటర్లు
- గుట్టుచప్పుడు గాకుండా భ్రూణహత్యలు
- అబార్షన్‌కు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు
- అబార్షన్ వికటించి మహిళ మృతి

మగ బిడ్డ కోసం తహతహలాడే కొందరు తల్లిదండ్రులు.. కాసులకు కక్కుర్తి పడే ప్రైవేట్ నర్సింగ్ హోంలు, ఆర్‌ఎంపీలు ఆడ పిల్లలను భూలోకంలోకి రాకముందే తల్లి గర్భంలోనే సమాధి చేసేస్తున్నారు. మొదటి, రెండు కాన్పుల్లో ఆడ పిల్లలకు జన్మనిచ్చి, మూడోసారి గర్భం దాల్చిన దంపతులు దొరికితే ప్రైవేట్ నర్సింగ్ హోంలకు, ఆర్‌ఎంపీలకు పండగే. కడుపులో ఉన్నది ఆడో, మగో చెబుతామని, ఆడ పిల్ల అయితే గుట్టుగా అబార్షన్ చేసేస్తామని చెప్పి పేదలకు ఆశ చూపుతున్నారు. అసలే పేదరికంతో బాధపడుతుండటం..అంతకు ముందే ఇద్దరు ఆడ పిల్లలకు జన్మనివ్వడంతో వారు కూడా సులభంగా వారి మాయలోపడుతున్నారు. ఇక వచ్చీరాని వైద్యంతో కొందరు ఆర్‌ఎంపీలు, ప్రైవేట్ నర్సింగ్‌హోంల వైద్యులు గర్భిణుల ప్రాణాలు తీస్తున్నారు. నాలుగు రోజుల క్రితం నందికొట్కూరులో ఓ ఆర్‌ఎంపీ చేసిన అబార్షన్ వికటించి మహిళ ప్రాణాలు గాల్లో కలిసిపోయిన ఘటన గురువారం వెలుగు చూసింది.

నందికొట్కూరు: పగిడ్యాల మండలం బీరవోలు గ్రామానికి చెందిన గుజ్జుల లోకేష్ భార్య శ్రీవాణి రెండు కాన్పులలో ఆడపిల్లలకు జన్మనిచ్చింది. మూడోసారి గర్భం దాల్చింది. ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి. స్కానింగ్‌లో ఆడబిడ్డ అని తేలిందని అబార్షన్ చేయాలని శ్రీవాణి కుటుంబ సభ్యులు జూలై 28న నందికొట్కూరులోని ఆర్‌ఎంపీ గీతా రాణిని సంప్రదించారు. అదే రోజు అబార్షన్ చేసి తన క్లినిక్‌లోనే ఉంచుకుని మరుసటి రోజు ఇంటికి పంపించింది. బుధవారం తీవ్ర రక్తస్రావమై పరిస్థితి విషమించడంతో నందికొట్కూరు ప్రభుత్వ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకురాగా.. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ చేయడం, డబ్బుకు ఆశపడి ఆర్‌ఎంపీ అబార్షన్ చేయడంతో ఓ మహిళ ప్రాణం అర్ధంతరంగా ఆగిపోయింది. లింగ నిర్ధారణ, భ్రూణహత్యలు చట్టరీత్యా నేరమని బోర్డులు ప్రదర్శిస్తూనే గుట్టుచప్పుడు గాకుండా స్కానింగ్ సెంటర్లలో ఇలాంటివి నిత్యం జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### బాలబాలికల నిష్పత్తిలో భారీ వ్యత్యాసం

అధికారులు భ్రూణహత్యల నివారణకు వంద శాతం చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంటున్నా నియోజకవర్గంలో ఆడ శిశువుల జననాలు తగ్గిపోతున్నాయి. నియోజకవర్గంలో 1991 జనాభా లెక్కల ప్రకారం 0-6 బాలబాలికల నిష్పత్తి 1000-980 ఉంటే 2011 జనాభా లెక్కల వరకు 0-6 వయసు బాలబాలికల నిష్పత్తి 1000-930కి పడిపోయింది. ప్రభుత్వం 1994లో గర్భస్థ పిండప్రక్రియ నిరోధక చట్టాన్ని (పీఎన్‌డీటీ) ప్రవేశపెట్టింది. చట్టాలపై అవగాహన కల్పించడానికి క్షేత్రస్థాయిలో నిధులు విడుదల అవుతున్నా బాలికల నిష్పత్తి తగ్గుతూనే ఉంది. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించడం లేదని ఆరోపణలున్నాయి. ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లపై పూర్తిగా నిఘా కొరవడింది. వైద్య, ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం నియోజకవర్గంలో 10 వరకు స్కానింగ్ కేంద్రాలున్నాయి. ఆడశిశువులకు బంగారు తల్లి, కల్యాణి లక్ష్మి వంటి పథకాలు ప్రవేశపెడుతున్నా ప్రభుత్వాలు భ్రూణహత్యల నివారణకు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.



### తనిఖీలు చేయని కమిటీలు

లింగ నిర్ధారణ, భ్రూణహత్యలను అరికట్టడంలో ఏర్పాటైన కమిటీలు ఏనాడూ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసిన దాఖలాలు లేవు. భ్రూణహత్యల నివారణకు గతంలో మొబైల్ బృందాలు ఏర్పాటు చేసుకుని స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించి అక్కడ ఉన్న సౌకర్యాలు, స్కానింగ్ నిర్వహణ, రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకునే వారు. ప్రస్తుతం ఆ బృందాలున్నా, అడ్వయిజరీ కమిటీలు వంటివి ఏర్పాటు చేసినా భ్రూణహత్యలు నివారించడంలో విఫలమవుతున్నాయి. పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నా ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనం.



అబార్షన్ వికటించి మృతి చెందిన శ్రీవాణి

### చట్టం ఏం చెబుతోంది

గర్భంలోనే ఆడశిశువులను చిదిమేసే వారిపై ఉక్కు పాదం మోపేందుకు ప్రభుత్వం 1994లో లింగ నిర్ధారణ నిరోధక చట్టం తెచ్చింది. ఈ చట్టాన్ని అనుసరించి గర్భిణి ఆరోగ్య పరిస్థితిలో మార్పులు, పిండం ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు తప్ప ఎలాంటి పరిస్థితిలోనూ పరీక్షలు చేయకూడదు. గర్భస్థ శిశు పరీక్షలు నిర్వహించే ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు, ఇతర కేంద్రాలు వైద్య, ఆరోగ్య శాఖలో తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉండాలి.

### లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకుంటాం. లింగ నిర్ధారణ చేసిన ఆస్పత్రిని సీజ్ చేస్తాం. అబార్షన్ చేసిన ఆర్‌ఎంపీపై విచారణ చేపట్టి క్రిమినల్ కేసు నమోదుకు సిఫార్సు చేస్తాం. లింగ నిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు డీఎంహెచ్‌ఓ, గైనకాలజిస్టు, రేడియాలజిస్టు, ఆర్డీఓ, డీఎస్పీ, న్యాయవాదితో పాటు 10 మందితో కూడిన అడ్వయిజరీ కమిటీ ఉంది. స్కానింగ్ సెంటర్లు నిర్వహించే హాస్పిటల్‌లో కనీసం ఆరు నెలల పాటు స్కానింగ్‌పై శిక్షణ పొందిన గైనకాలజిస్టు ఉండాలి. స్కానింగ్ మిషన్ ఏర్పాటు చేసుకునే వారు తప్పకుండా రిజిష్టర్ చేయించుకోవాలి.

– డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

### పంట నమోదు తప్పనిసరి

పాములపాడు: సాగు చేసిన పంటలను నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ ఫలాలు అందుతాయని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో మొక్కజొన్న పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగు చేస్తున్న కౌలు రైతులు కూడా పంట నమోదు చేయించుకోవాలన్నారు.

### ఉద్యాన పంటలను సాగు చేయండి

ఆత్మకూరురూరల్: రైతులు ఉద్యాన పంటలను సాగుచేసి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఉద్యాన అధికారి చందన రైతులకు సూచించారు. గురువారం ఆమె వడ్లరామాపురం గ్రామ పరిధిలోని ఉద్యాన పంటలను సందర్శించారు. ఉద్యాన పంటలకు సబ్సిడీలున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. ఆయిల్ పామ్ మొక్కలు పెంచడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చని, బోరు నీటి వసతి కలిగిన రైతులు ఆయిల్ పామ్ మొక్కల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కొట్టాల చెర్వు ఎంపీఈఓ ముర్తుజావలి, బీఏఐఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### సచివాలయం ప్రారంభం

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద మంజూరైన సచివాలయం, రైతుసేవాకేంద్రం, హెల్త్‌సెంటర్‌లను గురువారం ఎమ్మెల్యే జయసూర్య ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్మీకంపోస్టు తయారీకి చర్యలు తీసుకోవాలి

- జెడ్పీ సీఈఓ నాసర్‌రెడ్డి

పాములపాడు: ఎస్‌డబ్ల్యూపీఎస్ షెడ్లలో వర్మీ కంపోస్టు తయారీకి చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ నాసర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మద్దూరు గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీఎస్ షెడ్‌ను పరిశీలించి నిర్వహణ సక్రమంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడారు. ఐవీఆర్‌ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. డోర్ టు డోర్ కలెక్షన్ ప్రతి ఇంటికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీఓ సులోచన ఉన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసర్‌రెడ్డి

## నానో ఎరువులతో భూమి సారవంతం

వెలుగోడు: నానో ఎరువుల వాడకంతో భూమి సారవంతం అవుతుందని ఏడీఏ సరళమ్మ సూచించారు. గురువారం ఏఓ స్వాతి ఆధ్వర్యంలో వెలుగోడు సమీపంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ హేమ సుందర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ సరళమ్మ

### వడ్డేమాన్ పాఠశాలకు విరాళం

నందికొట్కూరు: మండల పరిధిలోని వడ్డేమాన్ గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థి, కర్నూలులో సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న శివగోపాల్ గౌడ్ గురువారం పాఠశాలకు రూ.15 వేలు విరాళమిచ్చారు. నందికొట్కూరులో జరిగిన ఓ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డికి శివగోపాల్ గౌడ్ చెక్కును అందజేశారు. ఈసందర్భంగా దాతను ఘనంగా సన్మానించారు. దాత అందజేసిన విరాళం బాలికలకు కుట్టు, అల్లికలు, ఎంబ్రాయిడరీ నేర్పించే మెటీరియల్స్ కోసం వినియోగించనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు విద్యాశాఖ సూపరిటెండెంట్ కోటేష్, ఉపాధ్యాయులు భీసన్న, శేషయ్య, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థి శివగోపాల్‌గౌడ్

### అలరించిన భక్తిరంజని

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై తెనాలికి చెందిన ఎస్. వరలక్ష్మీ కల్యాణి వారి భక్తిరంజని కార్యక్రమం అలరించింది. శరణు గజముఖ, శ్రీశైల శివమయం, లింగాష్టకం, బిల్వాష్టకం, శివతాండవస్తోత్రం, కాలభైరవాష్టకం, పలు శివకీర్తనలను నేరేళ్ళ వరలక్ష్మీ కల్యాణి, నాగమణి, అనురాధ తదితరులు ఆలపించారు. అలాగే నెల్లూరుకు చెందిన మీనాక్షి నృత్యాలయ ఆర్ట్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

### ఆవుల తరలింపును అడ్డుకున్న స్థానికులు

ఆత్మకూరురూరల్: పట్టణంలోని సంగమేశ్వర సర్కిల్ వద్ద ఆవులను తరలిస్తున్న వాహనాని స్థానికులు గురువారం అడ్డుకున్నారు. ఆవులను , కబేళాకు తరలిస్తున్నారన్న అనుమానంతో స్థానికులు వాహనాన్ని అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా వాహనంలో పెద్ద సంఖ్యలో ఆవులను కుక్కి తరలిస్తుండటంతో ఒక దూడ మరణించింది. దీంతో ఆవుల కంటైనర్‌ను స్థానికులు సీఐ రాముకు అప్పగించారు. పోలీసులు విచారణ జరిపి దర్యాప్తు చేస్తున్నారు.



అక్రమంగా తరలిస్తున్న గోవులున్న కంటైనర్

## వాడీవేడిగా మున్సిపల్ సమావేశం

- అడ్డదారి తీర్మానాలపై నిలదీసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు,



ప్రశ్నిస్తున్న కోఆప్షన్ సభ్యులు రషీద్, సుల్తాన్

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. చైర్‌పర్సన్‌కు, సభ్యులకు తెలియకుండా చేసిన తీర్మానాలపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నిలదీశారు. ఉదయం సమావేశం ప్రారంభం కాగానే తీర్మాన పత్రాలను మున్సిపల్ అధికారులు చదివి వినిపించారు. ఇందులో తొలి తీర్మానంతో పాటు ఐదు, ఆరు తీర్మానాలను వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సభ్యులు సుల్తాన్, కోఆప్షన్ సభ్యులు రషీద్ తీవ్రంగా వ్యతిరేకించారు. తీర్మానాలు ప్రవేశపెట్టేందుకు ఎవరు అనుమతించారంటూ మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబును నిలదీశారు. ఎమ్మెల్యే చెప్పడంతోనే ప్రవేశపెట్టామని మున్సిపల్ కమిషనర్ సమాధానం ఇవ్వడంతో కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.72,97,913 పట్టణంలో 9 చోట్ల సీసీ రోడ్ల ఏర్పాటుకు ఖర్చు చేస్తున్నామని ప్రవేశపెట్టిన ఒకటవ తీర్మానాన్ని, పురపాలక సంఘంలో కొన్ని కోర్టు పనులకు న్యాయవాది కేశవరెడ్డికి నెలకు రూ.15 వేల చొప్పున రెండేళ్ల కాలపరిమితికి వేతనం చెల్లించాలని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని, మరికొన్ని కోర్టు పనులకు నెలకు రూ.15 వేల చొప్పున దాదాపు ఆరేళ్లకు గానూ రూ.10.80 లక్షలు చెల్లించాల్సి ఉందని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నామని కౌన్సిలర్లు చెప్పడంతో వాటిని వాయిదా వేశారు. డంపింగ్‌యార్డు రహదారి ఏర్పాటుకు రూ.18 లక్షలు, పెద్దవాగు కల్వర్టు నిర్మాణానికి రూ.8 లక్షల కేటాయింపు తీర్మానాలకు స భ్యులు ఆమోదం తెలిపారు. తమకు తీర్మానాలకు సంబంధించి సమాచారం ఇవ్వకపోవడం పట్ల వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుల్తాన్ బాయ్‌కట్ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పశువైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలి

కొత్తపల్లి: మండల పశువైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు డిమాండ్ చేశారు. కుక్కకాటుతో నాగంపల్లి గ్రామంలో కాడెద్దులు మృతిచెందిన విషయం విదితమే. ఎద్ల యజమాని నాగరాజును ఆయన గురువారం పరామర్శించారు. మృతిచెందిన ఎద్దులకు పోస్టుమార్టం నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పశువైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కె.చిన్న ఉన్నారు.

### సన్మానం



పదవీ విరమణ పొందిన హెచ్ఎంను సన్మానిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: సీఎస్ఐ ఎయిడెడ్ హైస్కూల్ హెచ్ఎం ఎం.ఎస్.ఎస్ భరత్ భూషణ్ పదవీ విరమణ సందర్భంగా ఆయనను చర్చి పెద్దలు, సంఘ సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. అలాగే పదవీవిరమణ పొందిన సబ్‌జైల్ స్వీపర్ వెంకటమ్మ పలువురు సన్మానించారు. కార్యక్రమంలో కొణిదేల జెడ్పీ హైస్కూల్ పీడీ రవికుమార్, సంఘ సెక్రటరీ అంబమ్మ, సభ్యులు జయచంద్ర, నాగన్న, జాన్ క్రిషోఫ్టమ్, నాగేశ్వరరావు, నాగేంద్ర, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపో కంట్రోలర్ ఉసేనయ్య, అసిస్టెంట్ మెకానిక్ సలీంలు పదవీ విరమణ పొందిన సందర్భంగా గురువారం వారిని ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వినయ్‌కుమార్, ఆర్టీసీ సీఐ బి.కె.నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఉసేనయ్య దంపతులను సన్మానిస్తున్న డీఎం, ఆర్టీసీ ఉద్యోగులు

# పశు వైద్యం దైవాధీనం!

పశువైద్యంపై కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదు. పశువైద్య శాలల్లో సిబ్బంది కొరత ఉన్నా భర్తీ చేయడానికి మనసొప్పడం లేదు. వ్యాధులతో మూగజీవాలు అల్లాడుతున్నా ఆదుకునే నాథులు లేరు. ఇక కొన్ని పశువైద్యశాలలు శిథిలావస్థలకు చేరుకోగో మరికొన్నింటిలో సరైన మౌలిక వసతులు లేవు.

– మహానంది

- శిథిలావస్థలో తిమ్మాపురం పశు వైద్యశాల
- అటెండర్లు, ఎల్ఎస్ఏ పోస్టులు ఖాళీ
- సర్వేలకు వైద్యులు వెళ్తే వైద్యం కరువు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ప్రధాన ద్వారం వద్ద పెచ్చులూడిన దృశ్యం



కిటికీలు పగిలిపోగా అట్టలు అడ్డుగా పెట్టిన దృశ్యం

మహానంది మండలంలో వేలాది సంఖ్యలో పశువులు, కోళ్లు, జీవాలు ఉన్నా పశు వైద్యశాలల్లో మాత్రం కనీస వసతులు కరువవడంతో పాటు అరకొర సిబ్బందితో పశువైద్యం గగనంగా మారింది. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. ప్రధాన ద్వారం వద్ద పెచ్చులూడుతున్నాయి. కిటికీలు పగిలిపోయాయి. లోపల పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడో అప్పుడో అన్నట్లు కూలేందుకు సిద్ధంగా ఉండటంతో భయంతో విధులు నిర్వహిస్తున్నారు. భవనం అంతా పాడైపోయింది. ఇక్కడ గత ఏడాది నుంచి వెటర్నరీ అసిస్టెంట్, లైవ్ స్టాక్ అసిస్టెంటు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మందులు తెచ్చుకోవాలన్నా, పశువులకు వైద్య సేవలు అందించాలన్నా వైద్యుడు ఒక్కడే ఉండటంతో ఇబ్బందికరంగా మారింది. మందులు అయిపోతే డాక్టరే తెచ్చుకోవాలి, సర్వేలకు వెళ్లాలి, ఆస్పత్రిలో ఉండాలంటే కష్టంగా మారింది. ఇతర మండలాల్లో ఉన్న రూరల్ లైవ్ స్టాక్ యూనిట్స్‌లో సిబ్బంది ఉన్నా డిప్యుటేషన్ మీద నియమించడం లేదు. బాత్‌రూం, మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా ఉద్యోగులు తిమ్మాపురం పశు వైద్యశాలకు రావాలంటే జంకుతున్నారు. తమ్మడపల్లెలో ఉన్న ఆర్ఎల్‌యూ శిథిలావస్థలో ఉంది. గోపవరంలోనూ స్వంత భవనం లేక అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. వ్యాక్సినేషన్, డీవార్మింగ్, విలేజ్ విజిట్లు, నల్లమల అడవులు ఉండటంతో ఏవైనా వన్యప్రాణులు మృతిచెందితే పోస్టుమార్టం కోసం ఉన్న ఒక్క వైద్యుడు వెళ్తే ఆస్పత్రి మూసి వెళ్లాల్సిన పరిస్థితి. గాజులపల్లెలో ఉన్న మరో పశు వైద్యశాలలోనూ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు కేంద్రాల్లో సిబ్బంది లేకపోవడంతో పశు వైద్యం పాపం అన్నట్లు తయారైంది.

### ఆవులకు లంపీ స్కిన్...కోళ్లకు తెగుళ్లు

మహానంది మండలంలోని ఆవులకు మళ్లీ లంపీ స్కిన్ వ్యాధి వస్తుంది. దీంతో ఆవులు నరకయాతన అనుభవిస్తున్నాయి. వీటితో పాటు బర్రెలకు వివిధ రకాల సీజనల్ వ్యాధులు వస్తున్నాయి. కొన్ని కోలుకోలేక మృత్యువాత పడుతుండటం ఆవేదన కలిగిస్తుంది. దీంతో వేలకు వేలు పెట్టి కొనుగోలు చేసిన పాడిరైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పొట్టేళ్లు, మేకలు, గొర్రెలు వివిధ రకాల వ్యాధులతో పొలాల్లోనే కూలిపోతుంటే రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

### పశువుల గణన..

మహానంది మండలం ఎం.తిమ్మాపురం, గాజులపల్లె పశు వైద్య కేంద్రాల పరిధిలో పశువులు అధికంగా ఉన్నాయి. ఆవులు, బర్రెలు 7,114, గొర్రెలు, మేకలు, పొటేళ్లు 16,889, కోళ్లు 17,835 ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆస్పత్రుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించి అవసరం లేని చోట ఉన్న వీఎల్‌ఏలను, అటెండర్లను నియమించి పశువులకు సరైన సమయంలో వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని పాడిరైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పశువైద్య కేంద్రంలో ఉన్న సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మండల సర్వసభ్య సమావేశాల్లోనూ సమస్యలపై చర్చించాము. ఆస్పత్రి శిథిలావస్థలకు చేరింది. పలు మార్లు పెచ్చులూడి పడిపోయాయి. సిబ్బంది కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– డాక్టర్ కరుణాకర్, పశువైద్యాధికారి, తిమ్మాపురం